# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాబోయే తరాలకు పరిశుభ్రమైన పర్యావరణ వారసత్వాన్ని అందించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలను కోరారు.
- నక్సలిజాన్ని నిర్మూలించే దిశగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- చైత్ర శుక్లాది, ఉగాది పండుగల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 120వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం కానుంది.

==========================

చైత్ర శుక్లాది, ఉగాది, గుడి పడ్వా, చేతి చంద్, నవ్రేహ్, సాజిబు చెయిరోబా పండుగల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వసంతకాలం ప్రారంభంలో జరుపుకునే ఈ పండుగలు భారతీయ నూతన సంవత్సర ప్రారంభానికి ప్రతీకని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. ఈ పండుగలు భారతదేశ సాంస్కృతిక వైవిధ్యతను చూపుతూ... సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని రాష్ట్రపతి అన్నారు. ఈ పండుగల సమయంలో ప్రజలు ప్రకృతికి తమ కృతజ్ఞతలు తెలియజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా, సామరస్యం, ఐక్యతల స్ఫూర్తిని బలోపేతం చేయాలని, దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి నూతన శక్తితో పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

==========================

పర్యావరణ పరిరక్షణ, ప్రచార కార్యక్రమం నిరంతర కార్యాచరణ, సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ పర్యావరణ సదస్సు - 2025ను రాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాబోయే తరాలకు పరిశుభ్రమైన పర్యావరణ వారసత్వాన్ని అందించడం మన నైతిక బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పర్యావరణ స్పృహతో సరళమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన పర్యావరణం, ఆధునిక అభివృద్ధిని సమతుల్యం చేయడం ఒక సవాలు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ... భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఇంధన ఉత్పత్తి దేశం అని, 2030 నాటికి 500 గిగా వాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుందని ఆయన అన్నారు. భారతదేశం తన కార్బన్ ఫుట్ ప్రింట్ ను తగ్గించడంతో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో లక్షలాది ఉద్యోగాల కల్పన లక్ష్యమన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్య నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధితో సహా పర్యావరణం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను పరిష్కరించే నాలుగు కీలక సాంకేతిక సెషన్‌లు ఈ సమావేశంలో ఉంటాయి.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

==========================

మయన్మార్ లో ఏర్పడిన తీవ్ర భూకంపం అనంతరం భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మయన్మార్ సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లైంగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విపత్తులో ప్రాణనష్టం జరగడం పట్ల ప్రధానమంత్రి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసినట్లు సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. సన్నిహిత మిత్రుడిగా, పొరుగు దేశంగా ఉన్న మయన్మార్ ప్రజలకు ఇటువంటి కష్ట సమయంలో భారతదేశం సంఘీభావంగా నిలుస్తుందన్నారు. ఆపరేషన్ బ్రహ్మలో భాగంగా విపత్తు సహాయ సామగ్రి, మానవతా సహాయంతో పాటు రెస్క్యూ బృందాలను బాధిత ప్రాంతాలకు త్వరగా పంపుతున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు.

==========================

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా సిబ్బంది చేపట్టిన ఆపరేషన్‌లో 17 మంది నక్సలైట్లు మృతి చెందారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఈరోజు సామాజిక మాధ్యంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నక్సలిజానికి వ్యతిరేకంగా జరిగిన మరొక దాడిలో భారీగా ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి 31 తేదీ నాటికి నక్సలిజాన్ని నిర్మూలించే దిశంగా పని చేస్తోందని తెలిపారు. ఆయుధాలు, హింస మార్గాలు మార్పును తీసుకురాలేవని, శాంతి, అభివృద్ధితో మాత్రమే మార్పు సాకారం అవుతుందని అమిత్ షా తెలిపారు.

విరామం

==========================

ప్రపంచ వ్యాప్తంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత (స్టెమ్) రంగాలలో అత్యధిక శాతం పట్టభద్రులను భారతదేశం అందిస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఈరోజు యూనియన్ ఇంటర్నేషనల్ డెస్ అవోకాట్స్ (యుఐఎ) "కాన్ఫరెన్స్ ఆన్ ఇండియా: ది న్యూ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్" అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... బలమైన మధ్యవర్తిత్వం ఎంతో అవసరమని అన్నారు. న్యాయ వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో పాటు, సత్వర న్యాయం అందించడంలో సాంకేతికత ముఖ్య పాత్ర పోషిస్తోందని చెప్పారు. పేటెంట్లు, కాపీరైట్, డిజైన్ లు ఆమోదించడాన్ని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విధానాన్ని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను సందర్శించనున్నారు. ఉదయం 9 గంటలకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లి స్మృతి మందిర్‌లో దర్శనం చేసుకుని, ఆ తర్వాత దీక్షభూమిని సందర్శిస్తారు. తరువాత, ఆయన నాగ్‌పూర్‌లోని మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు శంకుస్థాపన చేసి, బహిరంగ సభలో ప్రసంగిస్తారు. నగరంలోని సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ప్రధానమంత్రి ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌కు వెళ్లి 33 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తారు.

==========================

భూకంప బాధిత మయన్మార్‌కు సహాయక చర్యగా చేపట్టిన ఆపరేషన్ బ్రహ్మలో భాగంగా సహాయ సామగ్రిని తీసుకువెళ్లేందుకు మరో రెండు భారత వైమానిక దళ విమానాలను సిద్ధం చేసింది. 15 టన్నుల అత్యవసర మానవతా సహాయాన్ని మొదటి విడతగా తీసుకువెళ్లిన భారత వైమానిక దళ C-130J విమానం ఈరోజు ఉదయం యాంగోన్ చేరుకుంది. సెర్చ్-అండ్-రెస్క్యూ సిబ్బంది, వైద్య బృందం ఈ విమానంలో వెళ్లిందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. మయన్మార్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా భారతీయ సమాజంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. భారతీయ పౌరులు అత్యవసర సమయంలో 9595 419602 నెంబరులో సంప్రదించాలని కోరింది.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 4 నుండి 6వ తేదీ వరకు శ్రీలంకలో పర్యటించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించకుని శ్రీలంక విదేశాంగ శాఖ ఉప మంత్రి అరుణ్ హేమచంద్ర ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత ప్రధానమంత్రిని స్వాగతించేందుకు శ్రీలంక ప్రజలు ఆసక్తిగా ఉన్నారని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అద్భుతమైన పురోగతి సాధించిందని, ప్రపంచ దేశాలలో ప్రముఖ స్థానానికి చేరుకుందని, నరేంద్రమోదీ న్యాయకత్వం ప్రాంతీయ ఐక్యత చాటిందని అరుణ్ హేమచంద్ర పేర్కొన్నారు.

==========================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా ఈరోజు గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలిత టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి గుజరాత్ టైటాన్స్ 10 ఓవర్లకు 1 వికెట్ నష్టానికి 92 పరుగులు చేసింది.

==========================

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లోని సుక్మా జిల్లాలో ఈరోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో 11 మంది మహిళా మావోయిస్టులతో సహా 17 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడగా, వారి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నక్సలైట్లలో ఒకరిని జగదీష్ అలియాస్ బుద్రాగా గుర్తించారు.

==========================

==========================